క్లుప్తంగా

రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి


దరఖాస్తు స్వీకరిస్తున్న ఏడీఏ వసంతసుగుణ

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రైతు బీమా సదుపాయాన్ని అన్నదాతలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణ అన్నారు. మండల కేంద్రంలో రైతు బీమా పథకం దరఖాస్తుల ప్రక్రియను ఏడీఏ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతీ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఏఈఓ శిరీష, రేవంత్ పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు



లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులోని నెల్లుట్ల బ్రిడ్జిపై ఎన్‌హెచ్ పరిధిలో ఉన్న లైట్లు పట్టపగలు వెలుగుతూనే ఉన్నాయి. ఇటీవలే 20 రోజులుగా కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో అంధకారంలో ఉండి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ నెల 12వ తేదీన కనెక్షన్ పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ఇదీ ఎన్‌హెచ్ అధికారుల తీరు. ఇప్పటికైనా స్పందించి ఆన్ ఆఫ్‌లు ఏర్పాటు చేసి బిల్లు ఎక్కువ రాకుండా వచ్చిన బిల్లులు సకాలంలో చెల్లించి కరెంట్ కట్ చేయకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడిని ఆశ్రమంలో అప్పగింత



జనగామ రూరల్: తప్పిపోయిన గుర్తుతెలియని ప్రత్యేక అవసరాలుగల బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఉప్పలయ్య బుధవారం ఆశ్రమమంలో అప్పగించారు. వివరాలు.. ఈనెల 9వ తేదీన మండలంలోని వెంకిర్యాల గ్రామంలో బాలుడు సంచరిస్తున్నట్లు డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో వెంటనే పోలీసులు 1098 ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి వెంటనే స్పందించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు బాలుడిని తాత్కాలిక ఆశ్రమం కోసం జఫర్‌గఢ్‌లోని ప్రజాధరణ ఆశ్రమానికి తరలించారు. బాలుడి వివరాలు తెలిస్తే 100, 1098కి ఫోన్ చేసి తెలపాలని ఉప్పలయ్య కోరారు.

బైక్ ర్యాలీ


జాతీయ జెండాలతో నాయకులు

లింగాలఘణపురం: బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కె.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర నాయకుడు సుభాష్, మండల కన్వీనర్ సతీష్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్, నాయకులు సందీప్, నాగరాజు, శ్రీనివాసు, మల్లేశ్, సాయి, మధుసూధన్, నవీన్, ప్రశాంత్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న విజయశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను నిబంధనల మేరకు త్వరగా చేపట్టాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. మీదికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆమె బుధవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జీపీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. జీపీ కార్యదర్శి అశోక్, కారోబార్ జగన్నాథం పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంలో నిర్లక్ష్యం

- యశ్వంతాపూర్ పాఠశాలలో నిత్యం పాములతో విద్యార్థుల సావాసం
- ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా ?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పేరెంట్స్


పాఠశాలకు ఆనుకోని ఉన్న చెరువు కట్ట


పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

జనగామ రూరల్: మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ నిర్మించడంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాఠశాల ప్రహరీ చెరువు కట్టకు ఆనుకొని ఉండటంతో వర్షాలకు గోడ కూలిపోయింది. దీంతో నిత్యం పాములు, తేళ్లు వస్తుండటంతో విద్యార్థులు భయబ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రాణాలు పోతేనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందిస్తారా అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే కూడా ఈ విషయాన్ని తెలియజేసినా త్వరలోనే ప్రహరీ నిర్మిస్తామని మాటలు చెబుతూ కాలం గడిపేస్తున్నారు. చెరువు కట్టలో నుంచి పాములు, తేళ్లు, విష పురుగులు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి తిరుగుతుంటంతో విద్యార్థులు భయపడుతున్నారు. గతేడాది ఓ విద్యార్థికి తేలు కుడితే సకాలంలో ఉపాధ్యాయులు ఆస్పత్రికి తీసుకెళ్లడం వల్ల ప్రాణాపాయం తప్పింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల ప్రహరీ నిర్మాణం చేపట్టి పిల్లల ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారనే నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాం. కానీ పాఠశాలకు ప్రహరీ లేక నిత్యం పాములు, తేళ్లు వస్తుండంతో పిల్లలు ఎలా ఉంటారో అని భయపడుతున్నాం. అధికారులు వచ్చి చూసినా ఫలితం లేదు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే ప్రహరీ నిర్మించి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. - ప్రశాంత్, పేరెంట్

చెరువును తలపిస్తున్న పాఠశాల


నర్మెట ఉన్నత పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

నర్మెట: ఇది ప్రభుత్వ పాఠశాలనా.. చేరువా..?! అన్న సందేహం కలగ మానదు చూసిన వారికి. మండలకేంద్రంలో జనావాసాల మధ్యన ఉన్న ఉన్నత పాఠశాల ప్రతీ వర్షాకాలంలో చెరువును తలపిస్తుంది. ఆటస్థలం కన్నా తరగతి గదులు నిర్మించిన ప్రాంతం కొంచెం లోతట్టుగా ఉండటంతో నీరంతా నిలిచి పాఠశాల తరగతి గదుల ఉనికికే ప్రమాదంగా మారింది. దీనికితోడు ఏడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన తరగతి గదులు శిథిలావస్తకు చేరుకుని విషపురుగులకు నిలయమై కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయులు భయం భయంగా గడుపుతున్నారు. తరగతి గదులును తొలగించాలని విద్యార్థుల తల్లితండ్రులు పలుమార్లు డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు కూల్చివేయాలని జిల్లా అధికారులు నిర్ణయించినా కార్యరూపం దాల్చుకోకపోవడం విశేషం. దీంతో బురద నీటిలో నుంచే విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి వెళ్తుండటంతో గదలన్నీ చిత్తడిగా మారుతున్నాయి. నీరు నిలువడంతో తరగతి గదులగోడలకు పగుళ్లు వచ్చాయి.

'క్విట్ ఇండియా' స్ఫూర్తితో ఉద్యమించాలి

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రావర్తి సోమయ్య


నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పాలకుర్తి: క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. బుధవారం పాలకుర్తిలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడితోపాటు 50 శాతం మద్దతు ధర కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులు వస్తే తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమ సత్యం, రాష్ట్ర నాయకుడు సోమ అశోక్ బాబు, బచ్చు లలిత, వేల్పుల సంపత్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి



జనగామ రూరల్: అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు


దేవరుప్పుల: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జనగామ రూరల్: మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏబీవీ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నవీనరాణి అన్నారు. బుధవారం కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ కళాశాల సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో నిరోధక కమిటీ కన్వీనర్ అనగాని శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: ఉజ్వల భవిష్యత్‌ను వినాశనం చేసే మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొలపాక భాస్కర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ జీనుగ అరుణాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులతో కళాశాల ప్రాంగణంలో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ డాక్టర్ బి.భవాని మాట్లాడారు. విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు గురికావద్దన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రవీందర్

కొడకండ్ల: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని మండల ప్రత్యేక అధికారి రవీందర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో రెండుమూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల వద్దకు చేపల వేటకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలను తాకకూడదని, సిబ్బంది అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎంపీడీఓ నాగేశ్వాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి విగ్రహావిష్కరణ


భక్తులు, పూజారులతో ఎమ్మెల్యే శ్రీహరి

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామంలో పూజారుల వేదమంత్రాల నడుమ పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాగా, బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆలయానికి చేరుకుని పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచమ్మ గుడి వరకు రోడ్డును మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ నేషనల్ హైవేనుంచి నుంచి చిల్పూరు గార్లగడ్డతండా వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయించడంపట్ల ఆయా గ్రామాల నాయకులు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి అభినందనలతో పాటు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం కృషి ఫలితంగా డబల్ రోడ్డు మంజూరు అయ్యిందన్నారు. దేశాయి తండ, పల్లగుట్ట, కృష్ణాజీగూడెం, ఫత్తేపూర్, గార్లగడ్డతండా గ్రామాల ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


స్టేషన్‌ఘన్‌పూర్: పోచమ్మ గుడి వద్ద భక్తులు


పాలకుర్తి టౌన్: బోనంతో వెళ్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/పాలకుర్తిటౌన్/పాలకుర్తి: కొత్తపల్లి, మీదికొండ, తిమ్మంపేట, కూనూర్, వావిలాల, పాలకుర్తిల్లో భక్తులు బుధవారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల మధ్య కులపెద్దలతో కలిసి మహిళలు బోనాలతో ఆలయాలకు వెళ్లి పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, పాలకుర్తిలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి బోనమెత్తుకుని ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.


జఫర్‌గఢ్: తిమ్మంపేటలో..


పాలకుర్తి: వావిలాలలో ముత్యాలమ్మ గుడి వద్ద బోనాలతో మహిళలు

రహదారులపై వరద.. రాకపోకలకు ఇబ్బందులు


రఘునాథపల్లి: బానాజీపేటలో కాజ్‌వేపై అడ్డుగా కంప వేస్తున్న గ్రామస్తులు


తరిగొప్పుల: చెరువు గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్

రఘునాథపల్లి: భారీ వర్షాలతో బుధవారం మండలంలోని పలు చెరువులు ఉప్పొంగడంతో వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగి పలు గ్రామాల్లో పౌరుల రాక పోకలకు అంతరాయం కలిగింది. ఇబ్రహీంపూర్‌లో పెద్ద చెరువు ఉధృతంగా అలుగు పోస్తుండంతో పాత ఊరు గ్రామస్తులు చిన్న మత్తడి దాటి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. బానాజీపేటలో కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహించిన వాగుతో కొద్ది సేపు రాక పోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే కోతకు గురి కాగా .. ప్రమాదాలు చోటు చేసుకోకుండా గ్రామస్తులు కంప అడ్డు వేశారు.

చెరువును పరిశీలించిన తహసీల్దార్

తరిగొప్పుల: పోతారం గ్రామంలోని చింతల చెరువు కట్టను తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. చెరువు కట్టకు గండి పడడంతో ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి గండిని పూడ్చాలని తెలిపారు. చెరువులు, కుంటల కట్టలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్సై రాజయ్య, డీటీ రామారావు, ఆర్ఐ అంద్రయ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఉన్న బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం నియామకానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలని ఆమె పేర్కొన్నారు. నెలకు 7,800 వేతనం అందించడం జరుగుతుందని, ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.


రైతు బీమా గడువు పొడిగించాలి

జనగామ రూరల్: జిల్లా పరిధిలో రైతు బీమా నమోదు గడువును పొడిగించాలని బానోత్ జితేందర్ నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషా, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనికి వినతిపత్రాలు అందజేశారు.

సామూహిక వన భోజనాలు

బచ్చన్నపేట: గోపాల్‌నగర్ గ్రామ బేడ బుడిగ జంగాల కుటుంబాలు బుధవారం సామూహిక వన భోజనాలకు వెళ్లాయి. మొదట కులదైవాలకు బోనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

జీడికల్‌లో తాగునీరు కలుషితం



లింగాలఘణపురం: మండలంలోని జీడికల్‌లో ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెరువు నిండిపోయి అందులో ఉన్న గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు మునిగిపోయి నీరంతా కలుషితమైంది. మూడు నాలుగు రోజులుగా నీళ్లన్ని నల్లాల్లో పచ్చగా వస్తున్నాయని, ఎవరూ స్పందించడంలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

రఘునాథపల్లి: రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమ కారుల ఫోరం జిల్లా నాయకులు నర్రా సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే నేరవేర్చాలన్నారు. కన్నారపు పరుశరాములు, బొల్లపల్లి శ్రీనివాస్, మేకల మురళి తదితరులు పాల్గొన్నారు.

వంతెనలు నిర్మించాలి

జనగామ రూరల్: గానుగుపహాడ్–చిటకోడూర్ వంతెనలు తక్షణమే నిర్మించాలని రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సీసా శ్రీధర్ అన్నారు. బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. కాగా, దీక్షకు రైతుసంక్షేమ సంఘం నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు ఈగం శ్రీనివాస్, జేరిపోతుల రాజయ్య, గండి నాగరాజు, భిక్షపతి, శ్రీను, సంపత్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



బచ్చన్నపేట: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామానుజాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వైద్య సిబ్బంది మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో చెరువులు, కుంట కట్టల పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. మండల స్పెషలాఫీసర్ అంబికాసోనీ, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, మండల వైద్యాధికారి సృజన, ఏఓ విద్యాకర్‌రెడ్డి, ఆర్ఐలు వంశీకృష్ణ, మునావర్ పాల్గొన్నారు.

మృతుడు హైదరాబాద్ వాసిగా గుర్తింపు


ఎండీ ఫరీద్ (ఫైల్)

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని అక్షయ హోటల్ ముందు ప్రవహిస్తున్న వాగులో మంగళవారం గుర్తించిన మృతదేహం హైదరాబాద్‌లోని బొలాక్‌పూర్‌కు చెందిన వ్యక్తిదని ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం తెలిపారు. హైదరాబాద్ బొలాక్‌పూర్‌కు చెందిన ఎండీ ఫరీద్ (47) కొన్నాళ్లుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. రెండు రోజులుగా మండల కేంద్రంలోని రహదారిపై సంచరించిన ఫరీద్ వరద ఉధృతిలో ప్రమాదవశాత్తు అందులో పడి మరణించినట్లు తెలుస్తుంది. మృతుడి సోదరులు ఎండీ షరీఫ్, లతీఫ్‌లు సామాజిక మాధ్యమాల్లో ఫరీద్‌ను గుర్తించారు. జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

దేవరుప్పుల: ప్రజాప్రయోజనార్థం నిర్మించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపంపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రామచంద్రాపురానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో రెండేళ్ల కిందట ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.5 లక్షలతో చేపట్టిన మురికి కాల్వ పనులు 200 మీటర్లు కూలి పోయిందని, మిగితా కాల్వ చెరువులో కూరుకపోయే పరిస్థితి ఉందని డీపీఓ సుజాత, ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కేత్వాల నర్సయ్య, అల్లం సుజాత, ఇన్నారెడ్డి, కె.ఆంజనేయులు, రమేష్, సోమాజీ ఉన్నారు.

గుంతల రోడ్డుపై నాటు వేసి నిరసన


జనగామ రూరల్: రోడ్డుపై నాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు, కాలనీవాసులు


స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డుపై నిలిచిన వర్షపునీటిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జనగామ రూరల్: పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి డిమాండ్ చేశారు. బుధవారం బాణాపురం ఇందిరమ్మ కాలనీలోని గుంతల రోడ్డుపై కాలనీవాసులతో కలిసి వరి నాటు వేసి నిరసన తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. ధరవత్ మహేందర్, సుంచు విజేందర్, గాజుల నాగరాజు, తాటి వసంత, పాముకుంట్ల రేణుక, శ్రీపతి, మమత, నరసయ్య, నీల పాల్గొన్నారు.

బురద రోడ్డుపై గ్రామస్తుల..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో పలువార్డులకు సీసీ రోడ్లు లేక మట్టిరోడ్లతో ప్రజలు పాట్లు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో మట్టిరోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. దాంతో ప్రజలు కనీసం కాలినడకన సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. ప్రధానంగా గ్రామంలోని ఐదవ వార్డులోని ఎల్లమ్మదేవాలయానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. దాంతో ఓపిక నశించిన కాలనీవాసులు బుధవారం బురదరోడ్డుపై నిరసన తెలిపారు. జాలిగపు శ్రీనివాస్, తూర్పాటి శ్రీహరి, దుర్గయ్య, ముత్తయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.